



# మా వూరి ఆసుపత్రి

రచన: శుభ్ర జ్యోత్స్న

అక్కా!

మా వూరి ఆసుపత్రి గురించి నీవు వినే వుంటావు. కొన్నాళ్ల క్రిందట యిక్కడికి వచ్చే రోగులు దీనిని "ధర్మాసుపత్రి" అనేవారు. దానికర్థం, ఉచితంగా వైద్యంచేస్తారనేకాదు, జబ్బులు వేగంగా నయమౌతాయనికూడ.

ప్రస్తుతం యిక్కడ పనిచేసే వ్యక్తులు మాత్రమే దీనిని ధర్మాసుపత్రి అంటున్నారు. కారణం యేమిటంటే వారికి బాగా "ధర్మాలు" జరుగుతున్నాయి.

ఆసుపత్రి భవనాన్ని కొత్తగా కొన్నింటిని కట్టించారు. కొత్తసిబ్బందిని వేశారు. కాని యింతచేసినప్పటికి రోగుల తెగుళ్ళు కుదరటంలేదు. ఒకవేళ రోగాలు ఎవరికైనా నయమైతే వారి అదృష్టమనే చెప్పాలి.

ఈ ఆసుపత్రిలో పనిచేసే ప్రతివొక్క డాక్టరుకు ప్రయివేటు ప్రాక్టీసు వుంటుంది. వీరు ప్రయివేటు ప్రాక్టీసును అభివృద్ధి చేసుకోవటంలో లీనమయివుంటారు. ఆసుపత్రికి పేరుకుమాత్రం వస్తారు.

ఈ అసుపత్రిపైగాని, ఇందులో పనిచేసే డాక్టర్లపైగాని నా కేమాత్రం కోపంలేదు. ఇదంతా నా అనుభవంపై చెబుతున్నాను.

ఇందులో పనిచేసే ప్రతివొక్క వ్యక్తికీ లంచంయిస్తే మనపని త్వరగా అవుతుంది. ఉదాహరణకి మొదట టిక్కెట్ల బుకింగుదగ్గర మనం టిక్కెట్టు తీసుకోవాలి. టిక్కెట్టు తీసుకోవాలంటే వరుసలో నిలబడాలి. అక్కడుండే వ్యక్తికి బేడో, మూడణాలో యిస్తే వాడే మనపేరుమీద టిక్కెట్టు తీసుకవచ్చేస్తాడు త్వరగా.

ఇక డాక్టరుగారి గదివద్దకువెళ్లే ప్యూను మనమిచ్చిన చీటీని తీసుకవెళ్లి డాక్టరుగారి బల్లమీద చీటీలన్నింటిక్రిందన పెడతాడు. వాడిచేతిలోకూడా ఏదైనా పడేస్తే, మన చీటీ మిగిలిన చీట్లపైకొస్తుంది. చూశావా డబ్బులో ఎంత మహిమొ!

ఒక్కొక్క ప్యూను యిటువంటివాడు కూడ వుంటాడు—"ఈ ఆసుపత్రి యిప్పుడు పాడై పోయింది. పేరుకుమాత్రమే యీ డాక్టరుగారు యిక్కడికి వస్తున్నారు. వీరు ప్రయివేటు ప్రాక్టీసు " ఫలానా " వీధిలో పెట్టారు. డబ్బుగురించి వెనకాడకుండా ఆయనదగ్గరకెళ్లితే, రోగం టక్కున కట్టేస్తుంది."

ఈ ఆసుపత్రితాలూకు అసలు మందులన్ని చాలమట్టుకు కాంపౌండర్లు, స్టాఫ్ నర్సులు, వార్డుబోయిలుమొదలైన వ్యక్తులు జాగ్రత్తగా తమ తమ యిండ్లకు పట్టుకపోతారు.

రాత్రికాలం యింకా బాగుంటుంది. నర్సులక్వార్టర్సుముందున చిన్నబజారులా సాగుతుంది. రిక్షాలు ఓ ప్రక్కన సిద్ధంగా వుంటాయి—వారు నిశ్చయించుకొన్న స్థలాలకు పోవటానికి.

ఇది నా కెలాతెలిసింది అని అడుగుతావేమో! ఒకరోజున మా ఆయన ఊరు వెళ్లారు. నేను ఒక స్నేహితురాల్ని కలుసుకోవడానికి మెడికల్ కాలేజి లేడీస్ హాస్టలుకి వెళ్ళాను. మరచిపోయాను—ఆమె ఎవరనుకున్నావు?—రాధ. జ్ఞాపకం వచ్చినదా? తెల్లగా వుంటుంది. మనతోపాటే ఇంటర్ చదివింది. మనబెంచీలో కూర్చునేది. ఇవుడు నీకు జ్ఞాపకంవచ్చిన దనుకుంటాను. అమెవద్దనుండి తిరిగి వచ్చేటప్పటికి చీకటి పడిపోయింది. నేనువచ్చే మార్గంలోనేవుంది నర్సెస్ క్వార్టర్సు.

మామూలప్పుడే యువతులలో నిగ్రహశక్తి లేకపోవటంచేత ఎటువంటి అఘాయిత్యాలు జరుగుతున్నాయో మనం చూస్తూనేయున్నాం. ఒక్కొక్కపుడు నర్సులుగా నియమింపబడ్డ స్త్రీలు వివస్త్రపురుషుల్ని చూడవలసివస్తుంది. అందుచేత వారిలోని నిగ్రహాశక్తి క్రమక్రమంగా దిగజారిపోతుంటుంది.

కొద్దిరోజుల క్రిందట ఒక స్టాఫ్‌నర్సుతో నాకు పరిచయం అయింది. ఉన్నదాని గురించి అడగటానికి భయందేనికి? నర్సుల వక్రమార్గాల సంగతి గురించి ఆమెను అడిగేశాను. నాకేమీ వాళ్లగురించి తెలియదనుకుంది కాబోలు మొదట నన్ను ఆమె బుకాయించింది. కాని తర్వాత అమె వొప్పుకుని చెప్పింది—"వాళ్ళకు దొరికే జీతాలు తక్కువ, అందుగురించే అలా చేస్తారని."

వాళ్ళకి జీతాలు తక్కువయితే లభించిన డబ్బునే పొదుపుగా వాడుకోవచ్చు. విలాసాలకి తగలేస్తే ఎంత యెక్కువజీతాలయినా అయిపోక మానదు.

వాళ్ళకి జీతాలు తక్కువగాబట్టి నర్సులు ఆ విధంగా చేస్తున్నారని ఆ స్టాఫ్‌నర్సు సమర్థింపచూసింది. జీతాలు తక్కువైనంత మాత్రాన ఆ విధంగా ఎవరూ చేయరు. తమ శీలాన్ని పాడుచేసుకోరు. స్త్రీలలో సహనశీలత ఎక్కువగా వుంటుంధనే ఉద్దేశంతోనే వాళ్ళను నర్సులుగా నియమించారు.

ఇక రాత్రిడ్యూటీలోవున్న నర్సుని రోగి ఎంతపిలిచినా పలుకదు. అఖరికి లేచి అతనికి కావాల్సింది యిస్తూ ఆ నర్సు అంటుంది — "రాత్రిపూటకూడ ఏమిటీ గోల. మమ్మల్ని నిద్రపోనీవా?"

నర్సులయొక్క యీ విషయంలో నీకు నమ్మకం కలగక పోవచ్చు. స్వయంగా చూస్తేనేగాని ఎవరికీ నమ్మకం కలుగదు యీ విషయంలో. కాని ఒకటిమాత్రం నిజం. కల్మషం లేనివాళ్ళు అక్కడక్కడా వుంటారు వారిలోను.

నియమితసమయాల్లోనే ప్రజలు ఆసుపత్రిలోనికి పోవాలి — మందులు తీసుకపోవటానికి, రోగుల్నిచూడటానికిను, అటుపైన ఎవరైనా లోనికి వెళ్ళదాం అనుకుంటే వారిని మెయిన్‌గేటు ప్యూను పోనివ్వడు. ఇంతకుముందే చెప్పాను కదా! చేతిలో కొంతపైకంపెడితే మన పనులన్నీ సక్రమంగా జరిగిపోతాయని, కాస్త మంచి దుస్తులువేసుకొని నిర్భయంగాపోతే వారిని ఎవరూకూడ అడ్డగించరు.

ఆసుపత్రి సక్రమంగా నడవాలంటే మందుల్ని కాంపౌండర్లు, స్టాఫ్‌నర్సులు, వార్డుబోయిలు పట్టుకపోకుండా చూడాలి. వారిపై తీవ్రమైన చర్యల్ని తీసుకోవాలి. మొహమాటపడకుండా డాక్టర్లవలన కూడ సక్రమంగా పని జరిగేటట్టు పైవారు ఏర్పాటుచేయాలి. లంచాలు తీసుకొనే వారిని తగిన అదుపాజ్ఞలలో పెట్టాలి.

నాదొక అభిప్రాయం విను. స్త్రీలను నర్సులుగా నియమించేబదులు పురుషుల్నే నియమిస్తే బాగుంటుంది. స్త్రీరోగులుండే చోట స్త్రీనర్సులుంటే ప్రస్తుతం జరిగే అనర్థాలు కొంతవరకు తొలగిపోతాయి. పైన చెప్పిన అనర్థాలు జరుగకుండా హాస్టలు పెద్దలు కాస్త శ్రద్ధతీసుకుంటే మంచిది.

ఇక యీ ఆసుపత్రి వైద్యం గురించి ఒకటిరెండు సంఘటనలను చెప్పి యీ వుత్తరం ముగిస్తా.

ఒకసారి ఏ కారణంచేతనో నా కళ్ళు చాలా ఎఱ్ఱగా అయిపోయాయి. కండ్ల కలక మాత్రంకాదు. బాగానే నిద్రపోతున్నాను. కండ్లలో నలకలేమీ పడలేదు. చికిత్స చేయించుకోటానికి ఆసుపత్రికి వెళ్ళాను. డాక్టరు నాముఖం అటూ యిటూ త్రిప్పారు. కండ్లు అటూ యిటూ ఆడించమన్నారు. తర్వాత ఆయన ప్రశ్నించారు — "కళ్లు ఎందుకు ఎఱ్ఱగా అయ్యాయి?"

"తెలియదండీ," అన్నాను.

"రెండవ ఆట సినిమాకు వెళ్లారా?'

"లేదండీ" అన్నాను.

"రాత్రి సరిగ్గా నిద్రపోలేదా?" అని అడిగారు.

"బాగానే నిద్రపోయానండీ"

"కంట్లో నలక ఏమైనా పడిందా"

"లేదండీ"

"అయితే నీ కండ్లు ఎందుకు యింత ఎఱ్ఱగా అయిపోయాయి" అని ఆయన నన్ను ఎదురుప్రశ్న వేశారు.

"అద్బే నాకుతెలియదండీ" అని అనబోయాను, కాని ఆయన తీరు చూస్తే యింకా ప్రశ్నలువేసేటట్టు కనబడ్డారు. నాకు భయంవేసింది.

''అవునండీ, కంట్లో నలకపడింది' అన్నాను.

ఆయన నన్ను వింతగాచూస్తూ అన్నారు. "కళ్ళు, కడిగించుకొని మందువేయించుకొని వెళ్లండి.''

ఆ మర్నాటినుంచి ఆసుపత్రికి మళ్ళా వెళ్ళనేలేదు. వాటంతటనే తగ్గిపోయాయి. కళ్లు ఎందుకు యెఱ్ఱగా అయాయో మనకేం తెలుస్తుంది. ఆ విషయం డాక్టర్లకు తెలియాలిగాని

ఒకసారి పెద్దతమ్ముడు సైకిలు త్రొక్కటం నేర్చుకుంటున్నపుడు క్రింద పడిపోయాడు. మర్నాటికి కుడిపాదం వాచిపోయింది. ఆసుపత్రికి తీసుకవెళ్ళారు. అక్కడ "ఎక్స్‌రే" తీశారు. రాత్రి 12 గంటలకు రక్తంతీసి పరీక్షచేస్తాం, రమ్మన్నారు. ఆ విధంగానే మూడురోజులు తీసుకవెళ్లాం. తర్వాత వాళ్లు పరీక్షచేసి చెప్పినదేమిటంటే ''యీ అబ్బాయికి జబ్బేమీలేదు. ఈ పాదానికేమీకాలేదు. హాస్పిటలుమందు త్రాగితే తగ్గొచ్చు.'' (లేకపోతే నయం కాకపోవచ్చుకూడ) నెలరోజుల వరకూ మందు త్రాగించాముగాని, దానివలన ఫలితం లేకపోయింది.

ఇవీ సంగతులు మా వూరి ఆసుపత్రి గురించి. చూశావా, వాళ్ళవైద్యం ఏవిధంగా వుందో! ఉంటానుమరి. ★


# కామధేను

ఇది విలువైన మలయాళ మూలికలతో ప్రాచీనాయుర్వేదపద్ధతిని శాస్త్రీయంగా తయారైన గొప్పమందు. వ్యాధిగ్రస్తులె కాక ఎట్టి వ్యాధిలేనివారుకూడా దీనినిసేవిస్తే దేహాన్ని బలపరచి రసాయనంగా పనిచేయును.

**దీనిని స్త్రీ పురుషులు నిరభ్యంతరముగా వాడవచ్చును. మందు మంచి రుచిగావుండును. పథ్యములేదు.**

వీర్యనష్టం, ఋతుదోషం, నరముల నిస్సత్తువ, సెగరోగం, మూత్రదోషం మొదలయిన వ్యాధులకు ఈ మందు పెట్టింది పేరు. మూత్రముతోపోవు శుక్లమును, మేహదుర్గ్నిరును, మేహవ్యాధిని, మేహదురదను, మూగతీటను, జననేంద్రియ సంబంధమైన రుగ్మతలను, జననేంద్రియం సన్నబడుట, చిక్కిపోవుట, లేపనశక్తి తగ్గివుండుట, మధుమేహం, నిద్రలేమి, ధాతు దృఢీకరణం లేకుండుట, నరముల నిస్సత్తువ మున్నగు వ్యాధులను ఇది తప్పక కుదుర్చును. మేహశాక మూలశాక, గుండెదడ, వెన్నునొప్పి, దగ్గు, కాసను మున్నగు బాధలను నివారణచేయును.

ఆకలిలేమి, మలబద్ధకం, నీరుకుట్టు, నడుమునొప్పి, కాళ్లుచేతులు తీట, తెలుపువ్యాధి, తలత్రిప్పట, జ్ఞాపకశక్తి తగ్గుట మొదలైన బాధలను నివారించి బలాన్ని, ఆరోగ్యాన్ని, దేహకాంతిని యిచ్చి యెంతో మేలుచేయును. శీఘ్రంగా ముసలితనం రాకుండా చేస్తుంది.

డబ్బి 1-కి రు. 3=0

**ధనలక్ష్మి అండ్ కో., ★ సౌకార్‌పేట, మద్రాసు-1.**